సాక్షి
అనకాపల్లి
బుధవారం, 8, అక్టోబర్, 2025

దంచికొట్టిన వాన



అనకాపల్లి పట్టణంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ చెరువులను తలపించాయి. ముఖ్యంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ, లోపల ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతం జలమయం కావడంతో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది ఇబ్బంది పడ్డారు.
- అనకాపల్లి టౌన్

కూటమికి హై టెన్షన్



రేపు విశాఖకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
ఎయిర్‌పోర్టు నుంచి మాకవరపాలెం మెడికల్ కాలేజీ వరకు రోడ్ షో
భద్రత ఇవ్వలేమని పోలీసులతో చెప్పించిన కూటమి ప్రభుత్వం
భారీ జనసందోహాన్ని కట్టడి చేయలేమని అనుమతి నిరాకరణ
ప్రత్యేక హోదా ఉద్యమం సమయంలో జగన్‌ను రన్‌వేపై ఆపేసిన పోలీసులు
ఇప్పుడు అదే ఆలోచనలో కూటమి ప్రభుత్వం..!

విశాఖ సిటీ : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన కాకపుట్టిస్తోంది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ సందర్శనకు వస్తుండడం కూటమి ప్రభుత్వంలో గుబులు రేగుతోంది. జగన్ పర్యటనతో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ కుట్ర బట్టబయలవుతుందన్న భయం వెంటాడుతోంది. దీనికి భారీ జన సందోహం తరలివచ్చే అవకాశం ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వానికి చెమటలు పడుతున్నాయి. దీంతో ఎలాగైనా జగన్ పర్యటనకు అడ్డంకులు సృష్టించాలని సర్వశక్తులు ఒడ్డుతోంది. ఇందులో భాగంగా జగన్ రోడ్ షోకు భద్రత ఇవ్వలేమని పోలీసు అధికారులతో చెప్పించింది. మంగళవారం విశాఖ పోలీస్ కమిషనర్, అనకాపల్లి జిల్లా ఎస్పీలతో అత్యవసర మీడియా సమావేశాలు పెట్టించింది. తమిళనాడులో జరిగిన తొక్కిసలాటను సాకుగా చూపించి జగన్ పర్యటనకు వచ్చే భారీ జన సందోహాన్ని కట్టడి చేయలేమని చేతులెత్తేసింది.

పర్యటనను అడ్డుకునే కుట్ర

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9వ తేదీ ఉదయం విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్‌షో ద్వారా అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మెడికల్ కాలేజీకి వెళ్లనున్నారు. ఈ మెడికల్ కాలేజీ సందర్శనను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం అధికార బలాన్ని గట్టిగా ప్రదర్శించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం భద్రత, ట్రాఫిక్, తోపులాటలు వంటి సాకులను తెరపైకి తీసుకొస్తోంది. విశాఖలో రెండు లక్షల మందితో విజయవంతంగా జరిగిన సమావేశాలు ఉన్నాయి. వేల సంఖ్యలో ప్రజలతో యాత్రలు జరిగాయి. కానీ జగన్ రోడ్‌షోకు మాత్రం ఈ సాకుల పేరుతో అనుమతి నిరాకరించింది. జగన్ పర్యటనలకు వస్తున్న ప్రజాదరణ చూసి కూటమికి కంటగింపుగా మారింది. దీంతో ఆ జనాలను భయభ్రాంతులు సృష్టించడానికి విశ్వప్రయత్నాలు చేస్తోంది. అనుమతి లేని జగన్ రోడ్‌షోలో పాల్గొనడం చట్ట విరుద్ధమని పోలీసులతో హెచ్చరికలు జారీ చేయించింది. వైద్య కళాశాలలు లేవని, వాటికి అనుమతులు లేవని సవాల్ విసిరిన అమాత్యులే ఇప్పుడు జగన్ పర్యటనను అడ్డుకోవాలని పోలీసులకు ఆదేశాలు జారీచేయడం గమనార్హం.

సవాల్ విసిరిన అమాత్యులకే చెమటలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మొత్తం 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలు చేపట్టింది. వీటిలో అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో కూడా కాలేజీ నిర్మాణంలో ఉంది. ఈ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. మెడికల్ కాలేజీల నిర్మాణమే జరగలేదని హోంమంత్రి వంగలపూడి అనిత, కాలేజీకి అనుమతి ఉంటే చూపించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సవాల్ విసిరారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నేతలు గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. ఇదిలా ఉంటే నిర్మాణం పూర్తయిన ఐదు కాలేజీలతో పాటు నిర్మాణంలో ఉన్న 12 కాలేజీల ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇది ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. వైద్య కళాశాలలే లేవని బుకాయించే ప్రయత్నం చేసిన కూటమి ప్రభుత్వం బండారం బట్టబయలైంది. ఇంతలో మాకవరపాలెంలో ఉన్న మెడికల్ కాలేజీ సందర్శనకు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9వ తేదీన రానున్నారు. దీంతో మెడికల్ కాలేజీలపై సవాల్ విసిరిన అమాత్యులకు చెమటలు పడుతున్నాయి. జగన్ పర్యటనతో కూటమి ప్రభుత్వం అబద్ధాలు బయటపడతాయన్న ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు.

ముందస్తు అరెస్టులకు సిద్ధం

వైఎస్ జగన్ రోడ్‌షోకు భారీగా జనాలు తరలివెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఆ పరిస్థితి రాకుండా ఉండేందుకు పోలీసుల ద్వారా వైఎస్సార్ సీపీ నేతలను ముందస్తుగా అదుపులోకి తీసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే నేతల హౌస్ అరెస్టులకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. వైఎస్సార్ సీపీ నేతలు మాత్రం జగన్ పర్యటనను విజయవంతం చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ప్రతి వార్డు నుంచి భారీగా పార్టీ శ్రేణులు ఎయిర్‌పోర్టుకు వెళ్లి పార్టీ అధినేతకు స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

నాటి ఘటన పునరావృతం కానుందా?

రాష్ట్రానికి ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తూ 2017 జనవరి 26న బీచ్‌రోడ్డులో 'క్యాండిల్ లైట్ ర్యాలీ'లో పాల్గొనడానికి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. విమానాశ్రయం రన్‌వే పైనే అప్పటి చంద్రబాబు ప్రభుత్వం జగన్‌ను నిలువరించింది. పోలీసుల సాయంతో జగన్‌ను ఎయిర్‌పోర్టు నుంచి బయటకు రాకుండానే చేసి వెనక్కి పంపించింది. ఆ ఘటన జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. ఇప్పుడు అదే తరహాలో జగన్‌ను ఎయిర్‌పోర్టులోనే అడ్డుకునే ఆలోచన చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే కూటమి ప్రభుత్వానికే నష్టమని ఆ పార్టీల నేతలే అభిప్రాయపడుతున్నారు.

ఆంక్షలు విధించినా ఆగేది లేదు!

- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భీమబోయినపాలెంలో మెడికల్ కాలేజీకి రోడ్డు మార్గానే వెళ్తారు
- హెలిప్యాడ్‌కు అనుమతి ఇస్తామనడంలో కుట్ర కోణం ఉందన్న అనుమానాలున్నాయి
- 65 వేల మంది జనం వస్తారని పోలీసులు చెబుతుండడం చూస్తుంటే ప్రభుత్వంపై వ్యతిరేకత అర్థమవుతోంది
- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్, కేకే రాజు



మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్. చిత్రంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

సాక్షి, విశాఖపట్నం : నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో మెడికల్ కళాశాల భవనాలను పరిశీలించడానికి ఈనెల 9వ తేదీన వస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డుకోవడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్ సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, కేకే రాజు మండిపడ్డారు. ఎన్ని ఆంక్షలు విధించినా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన ఆగేది లేదని స్పష్టం చేశారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు భద్రత కల్పించాలని ఐదు రోజుల క్రితమే అనకాపల్లి ఎస్పీ, విశాఖ సీపీని కోరామని, ఇప్పటివరకూ కాలయాపన చేసిన వారు జాతీయ రహదారిపై రోడ్డు మార్గంలో వెళ్లడానికి అనుమతి లేదని ఇప్పుడు చెబుతున్నారన్నారు. విశాఖ నుంచి మాకవరపాలేనికి జాతీయ రహదారి కాకుండా ప్రత్యామ్నాయ రోడ్డు చూపించాలని అడుగుతున్నామన్నారు. అయినా పర్యటనకు తాము అనుమతి కోరలేదని.. సెక్యూరిటీ కల్పించాలని మాత్రమే అడిగామని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతగా ప్రజా సమస్యలు తెలుసుకొనేందుకు వస్తున్నప్పుడు మీ పర్మిషన్ ఎవరికి కావాలంటూ ధ్వజమెత్తారు. తమ నాయకుడు రోడ్డు మార్గానే నర్సీపట్నం మెడికల్ కాలేజీకి వెళ్తారని, ఎవరు అడ్డుకుంటారో చూస్తామన్నారు. పోలీసులు, ప్రభుత్వం భద్రత కల్పించకపోతే వైఎస్సార్ సీపీ కార్యకర్తలే భద్రత కల్పిస్తారని అన్నారు. గతంలో వైఎస్ జగన్ పలు పర్యటనల్లో హెలికాప్టర్‌కు అనుమతి ఇవ్వలేదని.. ఇప్పుడు హెలికాప్టర్ మీదే రావాలంటున్నారంటే.. తనతో పాటు రాష్ట్రంలో ఉన్న వైఎస్సార్ సీపీ శ్రేణులకు, అభిమానులకు అనుమానం వస్తోందన్నారు. వాతావరణ పరిస్థితులు కూడా సవ్యంగా లేని సమయంలో పదే పదే హెలిప్యాడ్ అనుమతి కోరండి అని చెబుతుంటే, ఇందులో ఏమైనా కుట్ర కోణం ఉందేమోనని అనుమానం ఉందని అభిప్రాయపడ్డారు. తమిళనాడులో జరిగిన సంఘటనను బూచిగా చూపించి అనుమతి ఇవ్వలేమనడం సరికాదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు 65 వేల మంది జనాలు వస్తారని పోలీసులు చెబుతుండడం చూస్తుంటే ప్రభుత్వంపై వ్యతిరేకత అర్థమవుతోందన్నారు.

చంద్రబాబు పర్యటనను ఆపేస్తారా?

గతంలో చంద్రబాబు ప్రచార పిచ్చికి గోదావరి పుష్కరాల్లో 29 మంది, కందుకూరిలో 9 మంది చనిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. 2027లో మళ్లీ గోదావరి పుష్కరాలు ఉన్నాయని, పుష్కరాల సమయంలో చంద్రబాబు పర్యటనను ఆపేస్తారా? అని ప్రశ్నించారు.

అయ్యన్నపాత్రుడి నోటికి తాళాలేసేందుకు..

కళ్లు బైర్లు కమ్మి సవాల్ విసిరిన స్పీకర్ అయ్యన్న లాంటి వారి నోటికి తాళాలు వేసేందుకు, ఆయన అసత్య ప్రచారాలకు చెక్ పెట్టి.. మెడికల్ కాలేజీపై వాస్తవాలను తెలియజేసేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9న నర్సీపట్నంకు వస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయప్రసాద్, తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకటరామయ్య, విశాఖ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొన్నారు.

9న జగనన్న దృష్టికి 'గోవాడ సుగర్స్' దుస్థితి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు



కె.జె.పురంలో మాట్లాడుతున్న సుంకర శ్రీనివాసరావు

మాడుగుల రూరల్: ఈ నెల 9న జిల్లా పర్యటనకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి గోవాడ సుగర్ ఫ్యాక్టరీ దుస్థితిని తీసుకెళ్లనున్నట్టు చోడవరం సీడీసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన కె.జె.పురంలో నియోజకవర్గ మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ సూర్యనారాయణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల సందర్శనకు వస్తున్న వైఎస్ జగన్‌కి సుగర్ ఫ్యాక్టరీ దుస్థితిపై వినతిపత్రం అందజేస్తామన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి రూ.90 కోట్లు మంజూరు చేసి, ఆర్థికంగా ఆదుకున్న ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రస్తుతం సభ్య రైతులకు గడిచిన క్రషింగ్‌లో ఫ్యాక్టరీకి సరఫరా చేసిన చెరకుకు పేమెంట్లు కూడా ఇవ్వలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఆరోపించారు. జీతాలు లేక కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల నాయకులు, రైతులు స్వచ్ఛందంగా తరలిరావాలని **కోరారు.**

వీసంకు ముందస్తు నోటీసులు

నక్కపల్లి: ఈనెల 9వ తేదీన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పార్టీ సీనియర్ నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణకు నక్కపల్లి పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. వైఎస్ జగన్ పర్యటనకు కేవలం 2 వేల మందికి మాత్రమే అనుమతి ఉందని, 10 వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నామని, నక్కపల్లి నుంచి సీనియర్ నాయకులైన మీరు జనసమీకరణ చేసి ర్యాలీగా వెళ్లేందుకు అనుమతి లేదంటూ నోటీసులు జారీ చేశారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా రాప్తాడు, పాదిలి, రెంటపాళ్ల ప్రాంతాల్లో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ ముందస్తు చర్యల్లో భాగంగా రోడ్‌షోకు పోలీసు శాఖ అనుమతి నిరాకరించిందని, అలాగే నక్కపల్లి నుంచి జనసమీకరణతో నర్సీపట్నం పర్యటనకు వెళ్లడానికి వీల్లేదంటూ నోటీసులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీసం రామకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తోందని, దీన్ని నిరసిస్తూ ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం పర్యటనకు వస్తున్నారని, జగన్‌కు వస్తున్న జనాదరణకు తట్టుకోలేక కూటమి ప్రభుత్వం ఆంక్షలు విధిస్తోందన్నారు. ఎన్ని ఆంక్షలు విధించినా జగన్ పర్యటనను అడ్డుకోలేరని ఆయనపై ప్రజలకున్న అభిమానాన్ని చెరిపేయడం ఎవరి తరం కాదన్నారు.

ఏమ్మా.. ధరలు తగ్గాయా?

- కొత్త జీఎస్టీ శ్లాబ్ రేట్ల అమలుపై ఆరా
- డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లలో అధికారుల తనిఖీలు



అనకాపల్లిలో తూనికలు, కొలతల శాఖ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ రామచంద్రయ్య తనిఖీలు

అనకాపల్లి: ఏమ్మా.. జీఎస్టీ శ్లాబ్ రేట్లు తగ్గాయి కదా... తగ్గిన ధరకే వస్తువులు ఇస్తున్నారా? ధరలు తగ్గాయన్న సమాచారం మీకు తెలుసా.. అంటూ తూనికలు, కొలతల శాఖ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ బి.రామచంద్రయ్య పట్టణంలోని పలు డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లలో కొనుగోలుదారులతో మాట్లాడారు. డీమార్ట్, మోర్ తదితర స్టోర్స్‌లలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జీఎస్టీ 2.0 అమలుకు ముందు, సెప్టెంబరు 22 తర్వాత ధరల తేడాను వినియోగదారులకు వివరించారు. షాపులవారు ముందుగా కొనుగోలు చేసిన సరకులపై కొత్త ఎంఆర్‌పీలను ప్రకటించాలన్నారు. వ్యాపార సంస్థలు జీఎస్టీ సవరణ తేదీకి ముందు తయారు చేసిన అమ్ముడుపోని స్టాక్‌పై ఉన్న ఎంఆర్‌పీని సవరించవచ్చని, అయితే అసలు ఎంఆర్‌పీ తప్పనిసరిగా చూపించాలన్నారు. కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో జీఎస్టీ సంస్కరణలు మిశ్రమంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ వేలమూర్తి రామారావు, కన్స్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, రాంబిల్లి వినియోగదారుల మండలి అధ్యక్షుడు ఎస్.నూకరాజు (రాంబిల్లి), కన్స్యూమర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు నందవరపు సంజీవరావు (బుచ్చెయ్యపేట), బొడ్డేడ జగ్గప్పారావు (మునగపాక) పాల్గొన్నారు.

జనసేనలోకి వస్తే ఎంపీపీగా కొనసాగిస్తామన్నారు

- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభపెట్టి అవిశ్వాసం పెట్టారు
- పార్టీ కంటే ఎంపీపీ పదవి ముఖ్యం కాదు
- ఎంపీపీ బోదెపు గోవింద్ వెల్లడి



ఎంపీపీ బోదెపు గోవింద్‌ను సత్కరిస్తున్న సమన్వయకర్త ధర్మశ్రీ

యలమంచిలి రూరల్: జనసేనలో చేరితే ఎంపీపీ పదవిలో పూర్తి కాలం ఉంచుతామని తనపై స్థానిక జనసేన నాయకులు ఒత్తిడి తెచ్చారని, పార్టీ ఆవిర్భావం నుంచీ తాను వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతున్నానని, పార్టీ కంటే ఎంపీపీ పదవి తనకు ముఖ్యం కాదని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. ఉన్నతమైన పార్టీ పదవిని అధినేత వైఎస్ జగన్ తనకిచ్చారని, అంత కంటే ఇంకేం కావాలన్నారు. ఇటీవల పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కౌన్సిల్ (ఎస్ఈసీ) సభ్యుడిగా నియమితులైన గోవింద్‌ను మంగళవారం యలమంచిలి పార్టీ కార్యాలయంలో యలమంచిలి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇటీవల జరుగుతున్న రాజకీయ పరిణామాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉంటున్నాయన్నారు. ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే, కూటమి పార్టీల నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులను ప్రలోభపెట్టి తమ పార్టీల్లోకి అనైతికంగా చేర్చుకుంటున్నారన్నారు. గతంలో ఎప్పుడూ యలమంచిలి నియోజకవర్గంలో ఈ సంప్రదాయం లేదని, కూటమి పార్టీల నాయకులకు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదన్నారు. పదవుల కోసం పార్టీలు మారడం అత్యంత అనైతిక చర్యగా ఆయన అభిప్రాయపడ్డారు. యలమంచిలి మండల పరిషత్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభపెట్టి అవిశ్వాసానికి తెగబడ్డారని దుయ్యబట్టారు. ఇలాంటి అనైతిక చర్యలను ప్రజలంతా గమనిస్తున్నారని, కూటమి నాయకులకు తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు.

దేశంలో రక్త అవసరాన్ని తీర్చడం అంత సులభం కాదు

మంత్రి సత్యకుమార్



ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

కొమ్మాది: సుమారు 140 కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంలో రక్త అవసరాలు తీర్చడం అంత సులభం కాదని, ఇలాంటి పరిస్థితుల్లో హేతుబద్ధ వినియోగం జీవన విధానం మారాలని, తద్వారా రక్త సరఫరా కొరతను అధిగమించవచ్చని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విశాఖలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 'రక్తం, రక్త ఉత్పత్తుల హేతుబద్ధ వినియోగం' అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. దేశంలో ఏటా అవసరమైన రక్తం సుమారు 1.5 కోట్ల యూనిట్లు అంచనా కాగా, 10–40 లక్షల యూనిట్ల కొరత ఉందని నివేదికలు చెబుతున్నాయన్నారు. రక్తం, దాని ఉత్పత్తులను హేతుబద్ధంగా వినియోగించడం అంటే సరైన సమయంలో సరైన వ్యక్తికి సరైన రక్తాన్ని అందించడమేనన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా రక్త వినియోగంలో శాస్త్రీయ, మానవతా దృక్పథం రెండింటినీ సమన్వయం చేయాలని కోరారు.

ఎగసిపడ్డ నిరసన కెరటం

నిర్బంధాలు ఎదురైనా అగని మత్స్యకారుల పోరాటం

- బల్క్‌డ్రగ్ పార్కు ఉద్యమానికి పెరుగుతున్న మద్దతు
- అండగా నిలుస్తున్న నేతలను అడ్డుకుంటున్న పోలీసులు
- అయినా వెల్లువలా సంఘీభావం
- తాజాగా వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర సమావేశంలో బల్క్‌డ్రగ్ పార్క్ నిలిపివేయాలని తీర్మానం
- హోం మంత్రికి ఉక్కిరిబిక్కిరి



గత నెల 29న రాజయ్యపేట వచ్చిన హోం మంత్రి అనిత వాహనాన్ని అడ్డుకున్న మత్స్యకారులు



రాజయ్యపేటలో ప్రతి రోజూ భారీ సంఖ్యలో ఆందోళనలో పాల్గొంటున్న మత్స్యకారులు

నక్కపల్లి: రాజయ్యపేటలో మత్స్యకారుల ఉద్యమం రోజురోజుకు ఉధృతమవుతోంది. 24వ రోజుకు చేరుకున్నా అదే తీవ్రతతో కొనసాగుతోంది. తమ ఉనికికి విఘాతంగా నిలిచే బల్క్‌డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలంటూ మత్స్యకారులు చేస్తున్న నిరశన దీక్షకు వివిధ ప్రజాసంఘాలు, పార్టీల నుంచి మద్దతు పెరుగుతోంది. తాజాగా ఆదివారం ఆనందపురంలో జరిగిన ఉత్తరాంధ్ర స్థాయి వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశంలో బల్క్‌డ్రగ్ పార్క్ రద్దు చేయాలన్న ప్రస్తావన వచ్చింది. జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో కూడా ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు, ఎంపీలు మత్స్యకారులకు మద్దతుగా బల్క్‌డ్రగ్ పార్క్ ప్రస్తావన తీసుకువచ్చారు. బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ మత్స్యకారుల దీక్షకు మద్దతుగా రాజయ్యపేట వస్తుంటే ఇటీవల రాజమండ్రి సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. దీక్షలో పాల్గొనకుండా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అప్పలరాజును గృహనిర్బంధం చేశారు. సంఘీభావం తెలిపేందుకు సోమవారం రాజయ్యపేట బయలుదేరిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. అదేవిధంగా మంగళవారం డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్నను కూడా అడ్డుకొని, సెక్షన్ 30 యాక్ట్ అమల్లో ఉందంటూ నిలువరించారు.

రోజురోజుకు తీవ్రతరం

24 రోజుల క్రితం గ్రామంలో ప్రశాంతంగా ప్రారంభమయిన దీక్ష రోజురోజుకు తీవ్రతరమైంది. నాలుగు రోజుల ఆందోళన తర్వాత పనులు అడ్డుకున్నారు. ప్రభుత్వం గానీ, స్థానిక ప్రజాప్రతినిధి, హోం మంత్రి వంగలపూడి అనిత గానీ స్పందించకపోవడంతో ఆగ్రహం చెందిన మత్స్యకారులంతా రోడ్డుపై నిప్పు పెట్టి బల్క్‌డ్రగ్ పార్క్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ వాహనాలను అడ్డుకున్నారు. అధికారులు చర్చలు జరిపినా ఫలితం దక్కలేదు. దీంతో దిగి వచ్చిన హోం మంత్రి మత్స్యకారులతో చర్చలు జరుపుతానని వీడియో సందేశం పంపించారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం మంత్రి అనిత రాజయ్యపేట వచ్చినప్పుడు మత్స్యకారులు ఆమె కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. గ్రామస్తులంతా కమిటీగా ఏర్పాటయి వస్తే సీఎం చంద్రబాబు వద్దకు తీసుకెళ్తానని మంత్రి అనిత చెప్పినప్పటికీ వారు వినిపించుకోలేదు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని పట్టుబట్టారు. దీంతో ఆందోళన కారుల నుంచి తప్పించుకునేందుకు బల్క్‌డ్రగ్ పార్కు పనులు తాత్కాలికంగా నిలిపివేస్తామని, సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని ప్రకటించి అక్కడ నుంచి బయట పడ్డారు. అయితే గంగపుత్రుల ఆందోళన మాత్రం కొనసాగుతోంది. వీరి దీక్షలకు వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ, జాతీయ మత్స్యకార సంఘం, సంప్రదాయ మత్స్యకార సంఘాలు, ఇతర ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి.

హోం మంత్రికి ముందు నుయ్యి, వెనుక గొయ్యి

బల్క్‌డ్రగ్ పార్కు వ్యవహారం హోం మంత్రి వంగలపూడి అనిత మెడకు చుట్టుకుంటోంది. ఆమె పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా తయారయింది. రెండేళ్ల క్రితం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. రాజయ్యపేటలో హెటిరో డ్రగ్స్ వారు సముద్రంలోకి ఏర్పాటు చేస్తున్న పైపులైను వద్దంటూ మత్స్యకారులు చేసిన ఆందోళన శిబిరం వద్దకు వెళ్లి ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నాటి మాటలు నేడు ఏమయ్యాయని నిలదీస్తున్నారు. ఈ విమర్శలతో మంత్రికి ఏం చేయాలో దిక్కు తోచని పరిస్థితి నెలకొంది. పనులు తాత్కాలికంగా నిలిపివేసి మత్స్యకారులను శాంతింపచేసే ప్రయత్నాలు జరిగినప్పటికీ ఎంతో కాలం కొనసాగే అవకాశం కనిపించడం లేదు. ఇది మంత్రి స్థాయిలో తీసుకునే నిర్ణయం కాదు. కాంట్రాక్టర్ గనుక ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే పనులు తిరిగి పునః ప్రారంభమవుతాయి. దీంతో మత్స్యకారులు మరింత ఆగ్రహించే పరిస్థితి కూడా కనిపిస్తోంది. మరోపక్క ఉద్యమాన్ని నీరు గార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం కూడా సాగుతోంది. మంత్రి గ్రామంలోకి వచ్చి వెళ్లిన తర్వాత టీడీపీకి చెందిన ముఖ్యనాయకులు నిరాహార దీక్షలో పాల్గొనేందుకు దూరంగా ఉంటున్నారన్న చర్చ జరుగుతోంది. అయితే మత్స్యకార యువత మాత్రం ఈ వ్యవహారంలో తాడోపేడో తేల్చుకునేందుకు, అవసరమైతే ఏ స్థాయికైనా పోరాటాన్ని తీసుకెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. మంత్రి గ్రామంలోకి వచ్చి వెళ్లి వారం రోజులు దాటింది. దీనిపై ఇంకా ఎటువంటి ప్రకటన విడుదల చేయలేదు. ఉద్యమం మాత్రం కొనసాగుతోంది.

క్లుప్తంగా

సుప్రీంకోర్టు సీజేఐపై దాడికి నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఓ న్యాయవాది దాడికి పాల్పడడం దారుణమని అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లా హరశ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు స్థానిక న్యాయస్థాన భవన సముదాయం ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. న్యాయ వ్యవస్థలో ఇలాంటి ఘటన శోచనీయమన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బంధం రమణ, సీనియర్ న్యాయవాదులు సాయిరాం, ప్రభాకర్, సుంకర శ్రీనివాస్, సుధాకర్, జగపతి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



తీరంలో లభ్యమైన అశోక్ మృతదేహం

పాయకరావుపేట: మండలంలోని పాల్మన్‌పేట సముద్రతీరంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ జె.పురుషోత్తం తెలిపారు. కోటవురట్ల మండలం కె.వెంకటాపురం గ్రామానికి చెందిన యువకుడు పి.అశోక్ సోమవారం సముద్ర స్నానం చేస్తుండగా కెరటాల తాకిడికి గల్లంతయ్యాడు. అతని మృతదేహం మంగళవారం ఉదయం పాల్మన్‌పేట బీచ్‌లోనే లభ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఉపాధ్యాయులకు 'టెట్' టెన్షన్



అరిలోవ: దశాబ్దాలుగా ఉద్యోగంలో ఉన్న ఉపాధ్యాయులను టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఉత్తీర్ణత అంశం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. 2010 సంవత్సరం కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులు కూడా తప్పనిసరిగా టెట్ పాస్ కావాలని సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా అమలు కావాల్సిన పరిస్థితి నెలకొనడంతో, రాష్ట్రంలోని ఉపాధ్యాయ వర్గాలు తీవ్ర సందిగ్ధంలో పడ్డాయి.

విద్యా హక్కు చట్టం–2010 ప్రకారం ఉపాధ్యాయ నియామకానికి టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. అయితే, ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు మేరకు, 2010 కంటే ముందు వివిధ డీఎస్సీల ద్వారా ఉద్యోగాలు పొందిన వేలాది మంది కూడా టెట్ రాయాల్సి రావడంపై వారు ఆవేదన చెందుతున్నారు. డీఎస్సీ కోసం చదివి ఉద్యోగం సాధించిన మేము ఇప్పుడు మళ్లీ అర్హత పరీక్ష రాయడమేమిటి? అంటూ ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ఈ తీర్పు ప్రభావం విశాఖ ఉమ్మడి జిల్లాలో భారీగా ఉంది. ఇక్కడ ప్రభుత్వ యాజమాన్యాలలో సుమారు 17,000 మంది ఉపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల్లో మరో 12,000 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రైవేట్ టీచర్లు కూడా ఈ తీర్పు ప్రకారం టెట్ ఉత్తీర్ణులు కావాల్సిందే. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, ఇన్ సర్వీస్‌లో ఉన్న వారు టెట్‌లో ఉత్తీర్ణులు కాకపోతే ఉద్యోగానికి ఇబ్బంది తప్పదు. ఉద్యోగ విరమణకు ఐదేళ్ల లోపు సర్వీస్ ఉన్నవారికి మినహాయింపు ఇచ్చారు. అంత కంటే ఎక్కువ సర్వీస్ ఉన్నవారు తప్పనిసరిగా ఆగస్టు 31, 2027 లోపు టెట్ పరీక్ష ఉత్తీర్ణులు కావాలి. పదోన్నతి కావాలనుకునేవారు కూడా తప్పనిసరిగా టెట్ రాయాల్సి ఉంటుంది. రెండేళ్ల లోపు టెట్ పాస్ కాకపోతే ఉద్యోగం వదులుకోవాల్సి ఉంటుందని తీర్పులో వెల్లడించారు.

టెట్ పరీక్ష విధానం

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు రాయాల్సిన టెట్ పరీక్ష వివరాలు:

పేపర్లు: ఎస్జీటీలు పేపర్-1, స్కూల్ అసిస్టెంట్లు పేపర్-2 రాయాల్సి ఉంటుంది.

మార్కులు: రెండున్నర గంటల (150 నిమిషాలు) సమయంలో 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.

ఉత్తీర్ణత మార్కులు:

ఓసీ అభ్యర్థులు: 60 శాతం మార్కులు (90 మార్కులు).

బీసీ అభ్యర్థులు: 50 శాతం మార్కులు (75 మార్కులు).

ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగు అభ్యర్థులు: 40 శాతం మార్కులు (60 మార్కులు)

రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి

ఈ కీలక సమయంలో రాష్ట్రంలో కొత్తగా కొలువు దీరిన కూటమి ప్రభుత్వం టెట్ అంశంపై ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడంతో ఉపాధ్యాయుల్లో సందిగ్ధత మరింత పెరిగింది. మరోవైపు, టెట్ పరీక్షపై వారంలో నోటిఫికేషన్ విడుదల కానుందనే వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. దశాబ్దాల సర్వీస్ ఉన్నవారికి పరీక్ష రాయడం, అర్హత సాధించడం తీవ్ర సమస్యగా మారింది. అందువల్ల, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత వ్యవహారంలో మినహాయింపు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన ప్రకటన చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

ఎవరికీ లేని నిబంధనలు ఉపాధ్యాయులకేనా..?



రాష్ట్రంలో ఏ శాఖలో ఉద్యోగులకు లేని నిబంధనలు ఒక్క ఉపాధ్యాయులకే ఎందుకు పెడుతున్నారో అర్థం కావడంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయులపై ప్రయోగాలు చేస్తున్నాయి. ఉపాధ్యాయులు అవసరాలు పట్టించుకోకుండా, సమస్యలు పరిష్కరించకుండా వదిలేశాయి. ఇలాంటి నిబంధనలు మాత్రం మాపై రుద్దడం మంచిదికాదు. మరో వారంలో టెట్ పరీక్ష కోసం నోటిఫికేషన్ కూడా విడుదల చేయడానికి సిద్ధమవుతున్నారు. దవాబ్దాలుగా ఇన్ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు మళ్లీ ప్రత్యేకంగా అర్హత పరీక్ష నిర్వహించడంపై ఉపాధ్యాయ సంఘాలు ఖండిస్తున్నాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సరైన నిర్ణయం ఇంతవరకు ప్రకటించకపోవడం బాధాకరం.

–టి.ఆర్. అంబేడ్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

టెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి



ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ పరీక్షలకు మినహాయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఐదు సంవత్సరాలు పైబడి సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా రెండేళ్లలో టెట్ పరీక్ష నుంచి అర్హత సాధించాలని, లేదంటే ఉద్యోగం నుంచి తప్పుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేయడంతో ఉపాధ్యాయ వర్గాలు ఆందోళనకు గురవుతున్నాయి. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 2010 అక్టోబరు 23 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులంతా కచ్చితంగా టెట్ అర్హత పరీక్ష ఉత్తీర్ణులు కావాల్సి ఉందన్నారు. దీనివల్ల ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు పదోన్నతలను, మరికొందరు పూర్తిగా ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుంది. రెవెన్యూ, పోలీస్, వైద్యులు తదితర వృత్తుల్లో ఉన్నవారికి, ఉన్నతాధికారులకు లేని ఇన్ సర్వీస్ అర్హత ఉపాధ్యాయులకు మాత్రమే వర్తింపజేయడాన్ని తీవరంగా ఖండిస్తున్నాం.

–ఇమంది పైడిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్టీయూ

జీతం బకాయి కోసం కుటుంబ సమేతంగా ఆందోళన

- 29 మాసాలుగా వేతనం చెల్లించని పంచాయతీ కార్యాలయం
- న్యాయపోరాటానికి దిగిన విశ్రాంత ఉద్యోగి వెంకటరత్నం



కె.జె.పురం పంచాయతీ కార్యాలయం వద్ద కుటుంబ సభ్యులతో ఆందోళన చేస్తున్న విశ్రాంత ఉద్యోగి వెంకటరత్నం

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామ పంచాయతీ కార్యాలంలో గతంలో పని చేసిన కాలానికి జీతం ఇవ్వని కారణంగా పంచాయతీ కార్యాలయం వద్ద కుటుంబ సభ్యులతో ఓ మాజీ ఉద్యోగి మంగళవారం ఆందోళన చేపట్టారు. మాడుగుల గ్రామానికి చెందిన బోండా వెంకటరత్నానికి ఆమె భర్త మరణాంతరం స్పౌజ్ కోటాలో ఉద్యోగం వచ్చింది. వెంకటరత్నం భర్త ఆనందరావు గతంలో మాడుగుల గ్రామ పంచాయతీ కార్యాలయంలో బిల్లు కలెక్టరుగా పని చేసేవారు. 1998 సెప్టెంబరులో ఆయన మృతి చెందడంతో వెంకటరత్నానికి ఆఫీసు వాచ్‌వుమెన్‌గా ఉద్యోగం ఇచ్చారు. ఈమె కె.జె.పురం గ్రామ పంచాయతీలో 2019 డిసెంబరు 30న ఉద్యోగ విరమణ చేశారు. పంచాయతీ నిధుల కొరతతో 29 మాసాల జీతం ఆమెకు చెల్లించలేదు. సుమారు రూ. 9 లక్షలు పంచాయతీ నుంచి రావలసి ఉంది. ఈ జీతం గురించి ఉద్యోగ విరమణ చేసినప్పటి నుంచి పంచాయతీ కార్యాలయం చుట్టు తిరిగినా ఫలితం లేకపోయింది. బకాయి చెల్లించాలని అమె మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి అందోళన చేపట్టారు. ఆ సమయంలో పంచాయతీ జూనియర్ సహాయకులు, బిల్లు కలెక్టర్ వున్నారు. పంచాయతీ కార్యదర్శి చింతలూరులో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి నవీన్‌దొరతో అమె ఫోన్‌లో మాట్లాడారు. 5 మాసాలకు సంబంధించిన జీతాల ప్రతిపాదన పెడతామని ఫోన్‌లో హామీ ఇవ్వడంతో ఆమె ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలి



రహదారి భద్రతా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆమె గత సమావేశంలో చర్చించిన విషయాలపై తీసుకున్న చర్యలు, ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలుగా (బ్లాక్ స్పాట్స్) గుర్తించిన 26 ప్రాంతాల్లో తక్షణమే చర్యలు చేపట్టాలని, 15 రోజుల్లో నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. వ్యక్తిగత వాహనాలతో పాటు, మైనింగ్ రవాణా వాహనాలను నిత్యం పర్యవేక్షించాలని, ఓవర్ లోడ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, రెవెన్యూ, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలను ఐ–రాడ్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రులన్నీ రిజిస్ట్రేషను చేయించుకోవాలని, యాక్సిడెంట్ కేసులను తప్పనిసరిగా రిజిస్టర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, నర్సీపట్నం ఆర్‌డీవో వి.వి. రమణ, జిల్లా రవాణా అధికారి జి.మనోహర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి హైమావతి, రోడ్లు భవనాల శాఖ ఈఈ ఎస్.సాంబశివరావు, డీఈఈ విద్యాసాగరరావు, పోలీసు, మైనింగు, ఆర్‌టీసీ అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ ఎంపికలు

యలమంచిలి రూరల్: జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ ఆధ్వర్యంలో అండర్–19 బాల బాలికల జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు గురువారం నుంచి జరుగుతాయని ఉమ్మడి విశాఖ జిల్లా జూనియర్ కళాశాలల గేమ్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీవీ పుష్పలత తెలిపారు. 2007 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించిన 6 నుంచి 12వ తరగతిలోపు బాల బాలికలు ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఓపెన్ స్కూల్, ఐటీఐ, పాలిటెక్నిక్ చదువుతున్న, చదివిన విద్యార్థులు ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులు కాదన్నారు. ఎంపికలకు వచ్చే విద్యార్థులు వారి వయస్సు ధ్రువీకరణ పత్రం, విద్యార్థి పెన్ నెంబరు, విద్యార్థి చదువుతున్న తరగతి స్టడీ సర్టిఫికెట్, క్రీడా సామగ్రి, క్రీడా దుస్తులు తమ వెంట తెచ్చుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగే ఎంపికలకు ఉదయం 9 గంటలకు చేరుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94408 85898, 99516 76965, 99669 31556, 99850 65340, 98854 73808, 94938 83466 నంబర్లలో సంప్రదించవచ్చని ఆమె సూచించారు.

ఎంపికల షెడ్యూల్ ఇలా..

తేదీ	గేమ్	ఎంపిక స్థలం
9/10	బ్యాడ్మింటన్	ఇండోర్ స్టేడియం, గోపాలపట్నం
10/10	హాకీ	ప్రభుత్వ జూ.కళాశాల, నక్కపల్లి
13/10	బాస్కెట్‌బాల్, ఖోఖో	బీవీకే కళాశాల, విశాఖపట్నం
14/10	జిమ్నాస్టిక్స్, కలరియపట్	శ్రీకృష్ణాపురం
15/10	క్రికెట్	ఎన్టీఆర్ స్టేడియం, అనకాపల్లి
17/10	కబడ్డీ, యోగా, చెస్	ఎస్‌వీఎస్ జూ.కాలేజి, పరవాడ
18/10	వాలీబాల్	ప్రభుత్వ జూ.కళాశాల, చోడవరం
19/10	హ్యాండ్ బాల్, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్	శ్రీకృష్ణాపురం

మాజీ సీఎం జగన్ పర్యటన విజయవంతానికి పిలుపు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మాకవరపాలెం మెడికల్ కాలేజీ సందర్శనకు విచ్చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు తారువలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అధినేత జగన్‌కు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలతో పాటు పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయాలనే ఆశయంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. వీటిలో ఏడు కాలేజీలను పూర్తి చేశారన్నారు. నిర్మాణంలో ఉన్న కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుందని, దీంతో ఈ ప్రాంత పేద విద్యార్థులకు, ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో నూతనంగా మంజూరు చేసిన మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలనే డిమాండ్‌తో నర్సీపట్నం నియోజకవర్గం, మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ సందర్శనకు మాజీ సీఎం జగన్ వస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.

మహర్షి వాల్మీకి ఆలోచనలు స్ఫూర్తిదాయకం



మహర్షి వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి/తుమ్మపాల: మహర్షి వాల్మీకి ఆలోచనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్ర పటానికి కలెక్టర్ పూలమాల వేసి అంజలి ఘటించారు. అలాగే స్థానిక ఎస్పీ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం ప్రపంచానికి నిత్యనూతనంగా మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. వాల్మీకి జీవితం సమానత్వం, ధర్మం, న్యాయం, శాంతి వంటి విలువలకు ప్రతీక అన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు టి.లక్ష్మి, ఎస్.బాల సూర్యరావు, ఎస్‌ఐ శ్రీనివాసరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, బోయ కమ్యూనిటీ నాయకులు ఆదినారాయణ, జయకృష్ణ, అంగులూరి శ్రీను, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు



గాయపడిన రాజు

రావికమతం: మండలంలో తట్టబంద గ్రామంలో దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ లైటింగ్ ఏర్పాటు చేశారు. దేవి నవరాత్రులు ముగియడంతో మాడుగుల మండలం కింతలి గ్రామానికి చెందిన మంజేటి రాజు విద్యుత్‌తో అలంకరించిన దీపాలను మంగళవారం రాత్రి విప్పుతుండగా, ఇనుప వైరు విద్యుత్ స్తంభాలకు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానికులు రాజును రావికమతం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి ప్రాణాపాయం లేదని తెలిపారు.

'ఎల్‌ఆర్‌ఎస్'ను సద్వినియోగం చేసుకోవాలి

విశాఖ సిటీ: అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసినవారు ఎల్‌ఆర్‌ఎస్ పథకం ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవాలని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఒక ప్రకటనలో సూచించారు. 2025 జూన్ 30 ముందు అనధికార లేఅవుట్లలో కొనుగోలు చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ నెల 31వ తేదీలోగా నిర్దేశిత డాక్యుమెంట్లతో స్వయంగా గానీ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

సీతపాలెం భూములకు 13 నుంచి ఎన్యూమరేషన్

రాంబిల్లి (అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని సీతపాలెం గ్రామ తరలింపునకు సంబంధించి ఎన్యూమరేషన్ ఈ నెల 13 నుంచి చేపట్టనున్నట్లు ఆర్‌డీవో అయేషా తెలిపారు. మంగళవారం సీతపాలెంలో నిర్వహించిన గ్రామ సభలో స్థానికులతో రెవెన్యూ అధికారులు మాట్లాడారు. నవ్‌వీరా కంపెనీ కోసం కేటాయించిన భూములకు సీతపాలెం పరిధిలో ఇప్పటికే ప్రైవేట్ భూములకు సంబంధించి పరిహారం చెల్లించారు. మిగిలిన గ్రామ కంఠంలో గ్రామాన్ని తరలించేందుకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇళ్ల స్థలాలు ఇచ్చే భూముల అంశంపై స్థానికుల అభిప్రాయాలను అధికారులు అడిగారు. రెండు రోజుల గడువు కావాలని కోరగా, అధికారులు అంగీకరించారు. సమావేశంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

దాడి చేసి గాయపరిచిన వ్యక్తులపై ఫిర్యాదు

గొలుగొండ: మండలంలో పప్పుశెట్టిపాలెం గ్రామానికి చెందిన అన్నాచెల్లిని గాయపరిచిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గొలుగొండ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. బాధితులైన అన్న మార్తి నాని, చెల్లి మార్తి నందిని ఫిర్యాదు మేరకు పప్పుశెట్టిపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పొట్ల శ్రీను, కుమారుడు జయదేవ్ నర్సీపట్నం నుండి 10 మందిని తీసుకొచ్చి కత్తులతో దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. చుట్టుపక్కలున్న వారు వచ్చి రక్షించినట్లు బాధితులు ఫిర్యాదులో తెలిపారు. ఈ దాడిపై గొలుగొండ ఎస్‌ఐ రామారావుకు ఫిర్యాదు చేసిన వెంటనే నర్సీపట్నం నుండి వచ్చిన వారిని, శ్రీను, జయదేవ్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని గొలుగొండ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. భూమికి సంబంధించిన పాత గొడవలే ఈ దాడికి కారణమని తెలుస్తోంది. దీనిపై ఎస్‌ఐ రామారావు విచారణ జరుపుతున్నారు. ఈ దాడిలో తన మెడపై గాయమైనట్లు బాధితురాలు మార్తి నందిని పేర్కొన్నారు.

సెల్‌ఫోన్, నగదు కోసమే హత్య

- ఇద్దరు నిందితుల అరెస్టు
- మారణాయుధం, సొత్తు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐలు

సామర్లకోట/తుని రూరల్: తాగిన మైకంలో ఓ యువకుడితో గొడవపడి, అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ.ఐదొందల నగదు కోసం అతడిని హతమార్చిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. తుని రూరల్ పరిధిలోని నర్సీపట్నం బస్టాండ్ వద్ద ఈ నెల రెండో తేదీ రాత్రి తుని రైల్వే ఫ్లెక్షైవర్ కింద (నర్సీపట్నం బస్టాండ్ వద్ద) జరిగిన గుర్తు తెలియని యువకుడి హత్య సంచలనం రేపింది. కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలతో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో నియమించిన ప్రత్యేక బృందాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి హత్య కేసును ఛేదించారు. మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు వివరాలు వెల్లడించారు. గొల్లప్రోలు మండలం కొడవలికి చెందిన బొద్దు సురేష్, పాయకరావుపేటకు చెందిన తత్రా ప్రసాద్ చిత్తు కాగితాలు ఏరుకుంటూ, ఆ సంపాదనతో జీవనం సాగిస్తున్నారు. కుటుంబమంటూ లేకపోవడంతో వారు ఆకతాయిలుగా తిరుగుతున్నారు. వీరిద్దరూ ఈ నెల రెండు రాత్రి బస్టాండ్ సమీపంలో మద్యం సేవిస్తున్నారు. అదే సమయంలో అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన తానారి అప్పలనాయుడు (37) బస్టాండ్ వద్దకు వచ్చాడు. నిందితుల వద్దకు వచ్చిన సమయంలో పరధ్యానంలో అప్పలనాయుడు వారిపై పడబోయాడు. దాంతో సురేష్ అతడిని తోసేయడంతో జేబులో ఉన్న విలువైన సెల్‌ఫోన్ కిందపడింది. చొక్కా జేబులో నగదు కనిపించింది. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, నగదు కాజేసేందుకు నిందితులు కుట్ర పన్నారు. అతడి సెల్‌ఫోన్, నగదును నిందితులు లాక్కునే క్రమంలో వారి మధ్య తోపులాట జరిగింది. సమీపంలో ఉన్న రాయి, ఇనుప రాడ్డుతో నిందితులు అప్పలనాయుడిపై దాడి చేశారు. ఇష్టానుసారంగా కొట్టిన తర్వాత రాడ్డును తుప్పల్లోకి విసిరేసి, సెల్‌ఫోన్, నగదు తీసుకుని పరారయ్యారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ, సంఘటనా స్థలిలో దొరికిన ఆధారాలతో పోలీసులు కేసును ఛేదించారు. మంగళవారం తుని పట్టణ శివార్లలో తచ్చాడుతున్న నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. హత్యకు వాడిన ఇనుప రాడ్డు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పర్చుతామన్నారు. కేసును ఛేదించిన తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, గీతారామకృష్ణ, తుని రూరల్ ఎస్‌ఐ కృష్ణమాచారి, తొండంగి ఎస్‌ఐలు జగన్‌మోహన్, జె.విజయబాబు, సిబ్బందిని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.

ఆగిన బాల్య వివాహం

రావికమతం: ఐసీడీఎస్ అధికారుల చొరవతో మండలంలోని కొత్తకోటలో బాల్య వివాహానికి మంగళవారం అడ్డుకట్ట పడింది. 24 ఏళ్ల యువకుడికి 14 ఏళ్ల బాలికతో పెళ్లి నిశ్చయమైంది. ఇరు కుటుంబాలు వివాహం జరిపించేందుకు సన్నద్ధమయ్యారు. దీనిపై చైల్డ్ వెల్ఫేర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో రావికమతం ఐసీడీఎస్ సీడీపీవో మంగతాయారు, కొత్తకోట సెక్టార్ సూపర్‌వైజర్ ఉన్నీషా బేగం, మహిళా పోలీస్ నూకరత్నం, చైల్డ్ వెల్ఫేర్ సంస్థ ప్రతినిధి అంబేడ్కర్, అంగన్‌వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి యువకుడు ఇంటికి వెళ్లి విచారణ జరిపారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, 18 ఏళ్లు నిండే వరకు వివాహం చేయబోమని వారి తల్లిదండ్రులతో అంగీకారం పత్రం తీసుకున్నారు.

ముమ్మరంగా గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్

కె.కోటపాడు: మూడు నెలలు దాటిన ప్రతి పశువుకూ గాలి కుంటు నివారణ టీకాల కార్యక్రమం చేపడుతున్నట్లు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. కె.కోటపాడు మండలంలో దాలివలస, సింగన్నదొరపాలెం, కె.కోటపాడు గ్రామాల్లో పశువైద్య సిబ్బంది నిర్వహిస్తున్న గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం కె.కోటపాడు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో రికార్డులు ఆయన తనిఖీ చేశారు. విశాఖపట్నం, అనకాపల్లి డివిజన్లలో 2 లక్షల 46 వేల పశువులకు టీకాలు వేయాలని లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి లక్షా 57 వేల 844 పశువులకు టీకాలు వేసినట్లు వివరించారు. సెప్టెంబర్ 15న ప్రారంభమైన ఈ కార్యక్రమం అక్టోబర్ 15 వరకూ కొనసాగుతుందని తెలిపారు.

డ్వాక్రా మహిళలకు బ్యాంక్ లింకేజీ రుణాలు..

డీఆర్‌డీఏ ద్వారా డ్వాక్రా మహిళలు పశువులు కొనుగోలు చేసేందుకు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పించనున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు. ఇప్పటి వరకూ డ్వాక్రా మహిళల ద్వారా 980 పశువులు కొనుగోలు చేయించామన్నారు. ఈ రుణాలతో పెరటి కోళ్లు, గొర్రెలు, మేకలు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. పాడి రైతులకు బ్యాంక్‌ల ద్వారా పశు కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేయిస్తున్నామని అన్నారు. తద్వారా రూ.లక్షా 60 వేల వరకూ పశుదాణా, పశు ఇన్సూరెన్స్, పశువుల షెడ్ల మరమ్మతు వంటివి చేయించుకోవచ్చన్నారు. చౌడువాడ పశువైద్యాధికారి సీహెచ్‌వై నాయుడు, సిబ్బంది సమీరా, ప్రవీణ్‌కుమార్, జగన్నాథం, తేజ, హనుమంతు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 1200 గోకులం షెడ్ల నిర్మాణం లక్ష్యం..

దేవరాపల్లి: జిల్లాలో 1200 గోకుల షెడ్ల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1062 షెడ్లకు అనుమతులు జారీ అయ్యాయని విశాఖ, అనకాపల్లి జిల్లాల పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు మండలంలోని తెనుగుపూడి, ఎ. కొత్తపల్లి పంచాయతీ శివారు సంజీవపురంలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం 76 శాతం, విశాఖ జిల్లాలో 71 శాతం పూర్తయిందని, మిగిలిన లక్ష్యాన్ని వారంలోగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దేవరాపల్లి, ఎం.అలమండ, మామిడిపల్లి పశువైద్యాధికారులు జి. గాయత్రీదేవి, కె.మంజుషారాణి, జి. ప్రియాంక తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ.. యువకుడికి గాయాలు



గాయపడిన శ్రీను

రావికమతం: ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొనడంతో యువకుడికి గాయాలయ్యాయి. మండలంలో గర్నికం వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వి.పోన్నవోలు పంచాయతీ కుముందానపేట గ్రామానికి చెందిన మారబోయిన నాగ శ్రీను కుడి కాలు విరిగిపోయింది. నర్సీపట్నం నుంచి రావికమతం వస్తున్న ఆటో గర్నికం వద్ద బైక్‌ను ఢీకొట్టడంతో శ్రీను గాయపడ్డారు. క్షతగాత్రుడిని హుటాహుటిన రావికమతం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి వైద్య సిబ్బంది శ్రీనుకు ప్రథమ చికిత్స చేసి కాలు విరిగిందని నిర్ధారించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

శిథిలం.. నరకం

- అడుగడుగునా గోతులతో అధ్వానంగా కుంచంగి రోడ్డు
- వర్షం వస్తే అంతా బురదమయం
- మైనింగ్ టిప్పర్ల రాకపోకలతో ధ్వంసమవుతున్న వైనం
- ఏడాదిన్నర కావస్తున్నా హామీని అమలు చేయని ఎంపీ



కుంచంగి రోడ్డుపై పరిమితికి మించి ప్రయాణిస్తున్న క్వారీ లారీ



బురదమయంగా మారిన కుంచంగి రోడ్డు

తుమ్మపాల: ఎన్నికల్లో కల్లబొల్లి కబుర్లు చెప్పి ప్రజలను మభ్యపెట్టి అధికారం చెజిక్కించుకున్న కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయడం మర్చిపోయి ప్రజలు ముప్పుతిప్పలు పడేలా చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా గ్రామాలను ఏ విధంగానూ అభివృద్ధి చేయలేదు. కొత్త పనుల కార్యాచరణకు పూనుకోకుండా గత ప్రభుత్వంలో మంజూరైన పనులనే ఏడాది కాలంగా చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. మండలంలో అనేక గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రోడ్ల రూపురేఖలు ఏడాది కాలంలో మార్చేస్తామన్న నాయకులు ఇప్పుడు ఆ విషయం పట్టించుకోవడమే లేదు. జేబులు నింపుకుంటున్న మైనింగ్ మాఫియాకు అనుకూలంగా వారి జోన్లకు కోట్ల నిధులు వెచ్చించి రోడ్లు వేసుకుంటున్నారని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

కోట్లలో డీఎంఎఫ్ నిధులు..

కేబీ రోడ్డు నుంచి కుంచంగి, వెంకుపాలెం వరకు గల రోడ్డు ఆర్ అండ్ బీ పరిధిలో ఉన్నప్పటికీ ఆ శాఖ అధికారులు మాత్రం ఈ రోడ్డు స్థితిగతులపై కనీసం దృష్టి సారించడం లేదు. కుంచంగి గ్రామ పరిధిలో ఉన్న క్వారీల ద్వారా ఏడాదికి దాదాపు రూ.25 కోట్ల వరకు ఆదాయం వస్తుందని, డీఎంఎఫ్ నిధులను కూడా అభివృద్ధికి కేటాయించడం లేదంటు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా మారిన రోడ్డును డీఎంఎఫ్ నిధులతో అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

ఎన్నికల హామీ మర్చిపోయిన ఎంపీ..

ఎన్నికలప్పుడు గ్రామంలో ప్రచారం నిర్వహించి రోడ్డు అభివృద్ధి చేసి శాశ్వత పరిష్కారం చేస్తానన్న సీఎం రమేష్ ఎంపీగా గెలుపొందడం, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావడం జరిగిపోయాయి. క్వారీలపై పెట్టిన దృష్టి ప్రజల సమస్యపై పెట్టలేదని పలువురు వాపోతున్నారు. ఎంపీ అండదండలతో మండలంలో కుప్పల కొద్దీ క్వారీలు పెరిగిపోయాయని, వాటిలో అనధికార క్వారీల ద్వారా టన్నుల కొద్దీ మైనింగ్ తరలించేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. మైనింగ్ కార్యకలాపాలకు ఎటువంటి అడ్డంకులు వచ్చినా గంటల వ్యవధిలో అధికారులు వాలిపోతున్నారని, గ్రామాల్లో ప్రజలు రాకపోకలు సాగించే రోడ్ల దుస్థితిని మాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మండలంలో మార్టూరు, బవులువాడ రెవెన్యూ పరిధిలో గల క్వారీల నిర్వహణకు కోట్లు వెచ్చించి ప్రత్యేక మైనింగ్ రోడ్డు ఏర్పాటు చేయడంపై ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

అధ్వానంగా కుంచంగి రోడ్డు..

మండలంలో కుంచంగి రెవెన్యూ పరిధిలో 30కి పైగా క్వారీలు ఉన్నాయి. గ్రామంలోని ప్రధాన రహదారి ద్వారా కేబీ రోడ్డుకు నిత్యం వందల సంఖ్యలో లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.23 లక్షలతో రోడ్డు అభివృద్ధి చేసినప్పటికీ పరిమితికి మించి లారీలు ప్రయాణించడం వల్ల రోడ్డు అనతికాలంలోనే ధ్వంసమైపోయింది. కేబీ రోడ్డు నుంచి 3.5 కిలోమీటర్ల పొడవున రోడ్డుపై భారీ గోతులు ఏర్పడి వర్షం నీటితో బురదమయంగా మారింది. గ్రామంలోని బడి పిల్లలు, పెద్దలు, ద్విచక్ర వాహన చోదకులు రాకపోకలు సాగించలేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దీంతో పాటు గ్రామంలో రోడ్డు కూడా అధ్వానంగా తయారై ఏ మూల చూసినా బురద దర్శనమిస్తోంది.

అడుగడుగునా గోతులతో ఇక్కట్లు..



మా గ్రామ ప్రధాన రహదారిపై అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. వర్షానికి వాటిలో నీరు చేరి మరింత దారుణంగా తయారయ్యాయి. గ్రామంలోంచి బయటికి రావాలంటే భయమేస్తోంది. 3.5 కిలోమీటర్లు దాటితేనే కేబీ రోడ్డుకు చేరుకోగలం. బడి పిల్లలు, వృద్ధులు, కూలీలు నిత్యం ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. నిత్యం క్వారీ లారీలు తిరగడంతో రోడ్డంతా పూర్తిగా నాశనమైపోయింది. మైనింగ్ ద్వారా వచ్చే డీఎంఎఫ్ నిధులతో రోడ్డు బాగు చేయాలని కోరుతున్నాం.

– మార్టూరు త్రినాథ్, కుంచంగి

విద్య, వైద్యానికి కూటమి తూట్లు



హాజరైన గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు



మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: మాకవరపాలెంలో నిర్మాణ దశలో ఉన్న మెడికల్ కళాశాల పరిశీలనకు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9వ తేదీన వస్తున్నారని, ఆ పర్యటనను విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో అనకాపల్లి పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భరత్‌కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచితంగా వైద్య విద్య అందించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి భూమిపూజ చేసి నిర్మాణ పనులు చేపట్టారని, 5 మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వాటిని పీపీపీ పద్ధతిలో కారుచౌకుగా ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను పోలీసులతో అడ్డుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైస్ఎంపీపీలు అయితా రాము, విల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లేల సాయికిరణ్, 80,84 వార్డుల ఇన్‌చార్జిలు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు దండ సిద్ధార్థ, కొణతాల మురళీకృష్ణ, బొడ్డేడ శివ, మునూరు శ్రీనివాసరావు, నీటిపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, పద్మకుమారి, అల్లు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫలసాయం దిగుబడికి మేలైన పద్ధతులు



మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి: వరిలో పొడతెగులు ఆశించే అవకాశం ఉన్నందున్న సిఫారసు మేరకే ఎరువులు వేసుకుని, గట్ల పైనున్న కలుపును తీసివేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పొడతెగులు కనిపించినట్లయితే హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు లేదా ప్రొపికొనజోల్ 1 మిల్లీలీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో అగ్గితెగులు గమనిస్తే ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోతయోలేన్ 1.5 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో సుడిదోమ కనిపించినట్లయితే అసిఫేట్ 1.5 గ్రాము లీటరు నీటితో పిచికారీ చేయాలన్నారు. క్లోరాంత్రనిలిప్రోల్ గుళికలను ఎకరానికి 4 కిలోల చొప్పున యూరియాతో పాటు బురద పదును చూసుకుని వేసినట్లయితే కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. ఆఖరి దమ్ములో పొటాష్ వేయనట్లయితే దుబ్బుచేసే దశలో రెండో దఫా యూరియాతో పాటు 17 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. అంకురం దశలో ఉన్న వరి పైరుకు మూడో దఫా యూరియాను ఎకరానికి 25 కిలోల చొప్పున 17 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను బురద పదును చూసుకుని సమానంగా వెదజల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి.గౌరి, ఆర్.సరిత, సీహెచ్ రామలక్ష్మి, వి.చంద్రశేఖర్, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు వినతి



డిపో మేనేజర్ అనుపమశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి: జిల్లా కేంద్రంగా ఏర్పడిన అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణ్ కోరారు. స్థానిక డిపో మేనేజర్ కె.అనుపమశ్రీకి అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. వర్షాకాలం కావడంతో ప్రయాణికులు బస్‌ల కోసం వేచి ఉండే ప్రదేశంలోకి వర్షం నీరు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వర్షం నీటిలో పాటు డ్రైనేజీ నీరు కూడా కాంప్లెక్స్ ఆవరణలోకి రావడంతో ప్రయాణికులకు వివిధ రకాలైన వ్యాధుల బారిన పడే పరిస్థితి ఏర్పడుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేష్ గుప్త, కార్య వర్గ సభ్యులు వెంకటరమణ మూర్తి, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బుగిడి నూకప్పారావు, పొట్టి శ్రీరాములు భవన్ సంస్థ నిర్వాహకుడు పిరాట్ల నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి



డీఆర్‌వోకు వినతిపత్రం అందిపస్తున్న సూదికొండ మాణిక్యాలరావు

తుమ్మపాల: అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలంటూ బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు డీఆర్‌వో వై.సత్యనారాయణరావుకు వినతిపత్రం అందించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ గేటు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంగా ఉన్న అనకాపల్లిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తు కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తున్నారన్నారు. ఆయా శాఖలకు ఉన్న ఖాళీ స్థలాలతో పాటు స్థలాలు లేని శాఖలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించి తక్షణమే భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలతో పాటు ప్రధాన శాఖల కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగడం దారుణమన్నారు. పాలకులు, అధికారులు మొద్దు నిద్ర వదిలి ప్రజా ధనాన్ని ఆదా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్టుమూరి నూక అప్పారావు, ఫోరమ్ ఫర్ సోషల్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు కొల్లి చిన అప్పారావు, రాష్ట్ర దళిత వేదిక పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు వుడింగల నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

అనకాపల్లి టౌన్: ఆటో డ్రైవర్లు తప్పని సరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని డీఎస్పీ శ్రావణి తెలిపారు. స్థానిక బెల్లం మార్కెట్ యార్డు ఆవరణలో ఆటో డ్రైవర్ల అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించరాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు టి. విజయ్‌కుమార్, ఎం. వెంకటనారాయణ, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. పట్టణం జలమయం



పూర్తిగా నీట మునిగిన తుమ్మపాల రోడ్డు



నీట మునిగిన విజయరామరాజు పేట రైల్వే అండర్ బ్రిడ్జి



కశింకోట ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చేరిన వర్షపు నీరు

అనకాపల్లి టౌన్: పట్టణంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పలు రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. విజయరామరాజు పేట అండర్ బ్రిడ్జి, ఎన్టీఆర్ స్టేడియం పక్క రోడ్డు, గవరపాలెం పార్కు సెంటర్, శారదానగర్ తదితర ప్రాంతాలు మునగగా, ఆర్టీసీ కాంప్లెక్ ఆవరణలోకి ఎప్పటిలాగే నీరు చేరి చెరువును తలపించింది. ఉదయం నుంచి ఎండతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయిత్రం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన కుండ పోత వర్షం కురిసింది. దీంతో స్కూళ్ల నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థులు, గ్రామీణ ప్రాంతాల నుంచి తిరిగి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పల్లపు ప్రాంతాలు జలమయం..

కశింకోట: స్థానికంగా మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో పాటు కురిసిన భారీ వర్షం వల్ల పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోడ్డు, పశువుల ఆస్పత్రి రోడ్డు, మండల పరిషత్ కార్యాలయ ఆవరణ, భవానీ కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాలు నీటిమయం అయ్యాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. గవరపేట, కనకమహాలక్ష్మి వీధి, రౌతు వీధి తదితర ప్రాంతాల్లో వర్షం నీటితో పాటు మురుగు కాల్వల్లోని నీరు రోడ్డుపై ప్రవహించడంతో ప్రజలకు ఇబ్బంది తప్పలేదు. జాతీయ రహదారి పక్క పల్లపు ప్రాంతాల్లో కూడా వర్షపు నీరు ప్రవహించడంతో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. వర్షం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వర్షం తగ్గాక విద్యుత్ సరఫరాను సిబ్బంది పునరుద్ధరించారు. వరి, చెరకు పంటలకు ఈ వర్షం బాగా ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా కంది విత్తనాల పంపిణీ

అనకాపల్లి టౌన్: మండలంలోని వల్లూరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీవో సంతోష్ మాట్లాడుతూ రైతులు గట్లపై కందులు వేయడం వల్ల అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు. అదే విధంగా పూత దశలో ఆశించే పురుగులను ఈ కంది పంట ఆకర్షిస్తుందని, పక్షులకు స్థావరాలుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వల్లూరు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారులకు ముఖ ఆధారిత హాజరు

తుమ్మపాల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వేతనదారులకు ఇక నుంచి ముఖ ఆధారిత హాజరు నమోదు చేయనున్నట్లు డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. వేతనదారులు ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా ఈ–కేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. ఒకరికి బదులు మరొకరు పనికి రాకుండా నియంత్రించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో గల 3,68,156 మంది వేతనదారులందరికీ గ్రామాల్లో ఈ–కేవైసీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆధార్, జాబ్ కార్డ్‌తో క్షేత్ర సహాయకుడిని సంప్రదించాలన్నారు.

పాడి రైతులకు పశుదాణా బేసిన్ల పంపిణీ

దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడి విశాఖ డెయిరీ పాల సొసైటీ–3లోని సభ్య రైతులకు పశుదాణా బేసిన్లను డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ మేరకు యూనిట్ మేనేజర్ జి.ఎస్.వి.అప్పారావు, సూపర్‌వైజర్ జగ్గారావు, స్థానిక సొసైటీ అధ్యక్షుడు నందారపు అయ్యప్పనాయుడు, ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు సమక్షంలో బేసిన్లు అందజేశారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ



సాయినగర్‌లోని గృహ సముదాయాల మధ్య నిలిచిపోయిన వర్షం నీరు

తుమ్మపాల: దీటుగా అభివృద్ధి చెందుతున్న కొత్తూరు పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. పంచాయతీ కార్యాలయం సమీపంలోని ఇళ్లలోకి వర్షం నీరు చేరి రోజుల తరబడి నిలిచిపోతున్నా పట్టించుకునే నాథుడే లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లోకి నీరు చేరడంతో కొందరు ఇళ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారు. రెండు, మూడు అంతస్తుల్లో నివాసముండేవారు బయటికి రాలేని స్థితిలో ఉంటున్నారు. మోకాల్లోతు నీటిలోంచి రాకపోకలు సాగించాల్సి వస్తుందని వాపోతున్నారు. రోజల తరబడి నీరు నిలిచిపోతుందని, వర్షాకాలం వచ్చిందంటే వాహనాలను ఎగువ ప్రదేశాల్లో వదులుకుని నీటిలోంచి నడుచుకుంటు ఇళ్లకు చేరుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. సాయినగర్‌ను ఆనుకుని చెరువు ఉండటం, సరైన పారిశుధ్య నిర్వహణ లేకపోవడం, అనధికారిక బహుళ అంతస్తుల నిర్మాణాలతో ఈ ప్రాంతమంతా తరచు నీటి ముంపునకు గురవుతోందని, అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సాయినగర్ వాసులు కోరుతున్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి



వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న మండల అటవీ సెక్షన్ అధికారి చిరంజీవి

నాతవరం : అడవిలో సంచరించే జంతువులను వేటాడడం, చంపడం చట్ట రీత్యా నేరమని నాతవరం మండలం అటవీ సెక్షన్ అధికారి చిరంజీవి అన్నారు. మండలంలో గుమ్మడిగొండ, వెదురుపల్లి, కిమి గ్రామాల్లో మంగళవారం జంతువులను సంరక్షించడంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ముందుగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మండల వ్యాప్తంగా గ్రామసభలు అవగాహన సదస్సులు నిర్వహించి వన్యప్రాణుల సంరక్షణ గురించి వివరించడం జరుగుతుందన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి జంతువులను వేటాడితే అటవీచట్టం ప్రకారం ఎటువంటి చర్యలు ఉంటాయో వివరించారు. అడవులతో పాటు వన్యప్రాణులు రక్షించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్తులు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో వెదురుపల్లి, పెడిమికొండ, నాతవరం అటవీ బీట్ ఆఫీసర్లు నాగరాజు, లోవరాజు, మహంతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు మరిడిమాంబ ఉత్సవం



మరిడిమాంబ అమ్మవారు

కశింకోట: స్థానిక మరిడిమాంబ అమ్మవారి ఉత్సవం ఈనెల 9న జరగనుంది. ఈ సందర్భంగా కనకమహాలక్ష్మి వీధి, కస్బా వీధి ప్రాంతాల్లో ఉన్న అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి గరగలతో పల్లకిని గ్రామంలో ఊరేగిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద విద్యుత్ దీపాలంకరణతో పాటు రాత్రి సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన మధు

కశింకోట: స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన విద్యార్థి ఎస్. మధు రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అనకాపల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో 17 ఏళ్లలోపు 60 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పథకం సాధించాడు. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం ఎస్‌జేవీ ప్రసాద్ తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటాడన్నారు. ఇదే పోటీలో పాల్గొన్న విద్యార్థులు జె. రామచరణ్, సయ్యద్ అబ్దుల్ అజీజ్ షా ఖాదరి రజత పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా వీరిని హెచ్ఎంతో పాటు పీడీలు వి.ప్రభాకరరావు, పెంటకోట కమల, ఉపాధ్యాయులు అభినందించారు.


ఘనంగా వాల్మీకి జయంతి



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ సభ్యుడు నుదురుపాటి తాతాజీ

అనకాపల్లి టౌన్: మండలంలోని శారదానగర్ నాల్గవ వీధి సీతారామ కల్యాణ మండపంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ పట్టణ సభ్యుడు నుదురుపాటి తాతాజీ మాట్లాడుతూ కోట్లాది మంది ప్రజల ఆరాధ్యదైవం శ్రీరాముడు గాథను మానవాళికి అందించిన వాల్మికిని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు, కాళహస్తి, పీలా హేమ జగదీష్, గోకవరపు రమేష్, బోడాల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 167 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,300	5,300
మొదటి రకం	4,510	5,040
రెండో రకం	4,000	4,150
మూడవ రకం	3,930	3,930

అనకాపల్లి సినిమాలు

రాజా	:ఇడ్లీ కొట్టు
సత్యనారాయణ స్క్రీన్-1	: కాంతార
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: ఓజీ
షిర్డిసాయి	: ఓజీ
వెంకటేశ్వర	: అర్జున చక్రవర్తి
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 103 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–25, బీ పాజిటివ్–33, ఓ పాజిటివ్–44, ఏబీ పాజిటివ్–6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 321 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924–223595)ని సంప్రదించవచ్చు.